సాక్షి శ్రీకాకుళం

శనివారం । 7 । డిసెంబర్ । 2024



ఉచిత విద్యుత్‌కు ఎసరు

ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం ఎసరు పెడుతోంది. సబ్సిడీ ఎత్తివేసేందుకు చూస్తోంది.

- 10లో



చిక్కిన గంజాయి ముఠా

గంజాయి ముఠా పోలీసుల చేతికి చిక్కింది. సోంపేట రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నారు.

- 10లో

12 నుంచి డిగ్రీ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం పరిధిలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 12వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఎగ్జామినేషన్ యూజీ డీన్ జి.పద్మారావు చెప్పారు. 23వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ఇసుక లభ్యత పెంచాలి: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఇసుక లభ్యత మరింత పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఇసుక లభ్యత, ధరలు, అక్రమ రవాణా, ఇతర ఫిర్యాదులపై ఆయన కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలసి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో పాల్గొన్న ట్రాన్స్‌పోర్టర్లు, రీచ్ నిర్వాహకులు, బిల్డర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో మాట్లాడారు. జిల్లాలో ఇసుక ధరలపై తరచుగా సమీక్షించాలని ఇసుక సమస్యలపై టోల్ ఫ్రీ 18004256012, వాట్సాప్ నంబర్ 97016 91657ను సంప్రదించడం ద్వారా వివరాలు అడిగి తెలుసుకోవచ్చన్నారు. నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. ఇసుక రవాణాకు బిల్లులు జారీ చేసే విధానం, నకిలీ బిల్లులను గుర్తించే విధంగా తీసుకునే చర్యలపై అవగాహన కల్పించారు. ఎడ్లబళ్లపై ఇసుక తీసుకువెళ్లే వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని, రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు జరగకుండా నిఘా పెంచాలని అన్నారు. అన్ని రీచ్‌లలో లైట్లు, కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెప్పారు.

విక్రయాలు తగ్గితే కష్టమే

నరసన్నపేట: మహిళా మార్టుల్లో విక్రయాలు పెంచాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం నరసన్నపేట వెలుగు కార్యాలయానికి వచ్చిన ఆయన మహిళా మార్ట్ సిబ్బంది, స్థానిక ఏపీఎం అప్పలరామయ్యలతో మాట్లాడి మహిళా మార్ట్‌లో విక్రయాల గురించి ఆరా తీశారు. అమ్మకాలు బాగా తగ్గాయని పీడీ అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కష్టమని అంటూ విక్రయాలు పెంచాలని సిబ్బందికి సూచించారు. అలాగే మండలంలో నిర్వహిస్తున్న ఏకేపీ కార్యక్రమాలపై ఆరా తీశారు. రుణాల మంజూరు, కొత్త గ్రూపుల ఏర్పాటు, మొండి బకాయిల వసూళ్లు, ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు వంటి వాటిపై సిబ్బందితో సమీక్ష చేశారు.

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వండి

శ్రీకాకుళం అర్బన్: ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం పురం సోషల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి గురువారం అర్ధరాత్రి ఉరి పోసుకొని మరణించడంపై జిల్లా అధికారులు సత్వర నివేదిక అందించాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. విద్యార్థి మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని, పరీక్షల ఒత్తిడి ఏమైనా ఉందా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పరిశీలన జరిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఆయా వివరాలు పంపాలని సూచించినట్లు తెలిపారు.

● అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పెదపాడులోని ధర్మాన క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అన్నారు.విజయవాడలోని 125అడుగుల అంబేడ్కర్ స్మృతివనం, విగ్రహావిష్కరణ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. పార్టీ ఎస్సీ సెల్ నాయకులు పొన్నాడ రుషి, యజ్జల గురుమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కళింగవైశ్య విభాగపు అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ తూర్పుకాపు రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, టెక్కలి సమన్వయకర్త పేరాడ తిలక్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సెక్రటరీ కిల్లి సత్యనారాయణ, జిల్లా రైతు విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, జనరల్ సెక్రటరీ శంకరావు, గార ఎంపీపీ గొండు రఘురామ్, పార్టీ నాయకులు గేదెల పురుషోత్తం, ఎచ్చెర్ల శ్రీధర్, బగ్గు అప్పారావు, డాక్టర్ శ్రీనివాస్‌పట్నాయక్, శ్యామ్, గొద్దు కృష్ణ, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం రూరల్

నాటి సమాజంలో ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేడ్కర్ చేసిన పోరాటం చిరస్మరణీయమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ న్యాయవాదిగా, ఆర్థిక వేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా భారతీయ సమాజంలో అంబేడ్కర్ పేరుగాంచారన్నారు. అంతకంటే మిన్నగా రాజ్యాంగ నిర్మాతగా ఆయన పేరు చరిత్ర ఉన్నంతకాలం పదిలంగా ఉంటుందన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వ మోహన్ రెడ్డి, దళిత నాయకులు కంఠ వేణు, పోతల దుర్గారావు, కల్లేపల్లి రాంగోపాల్, గంజి ఎజ్రా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


– శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, దళిత సంఘ నాయకులు

కేటాయింపు మూరెడు.. ఖర్చులు బారెడు

- సర్కారీ బడుల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ డే పేరిట హడావుడి
- జిల్లాలో 2,638 బడులకు రూ.48.76 లక్షలు మాత్రమే కేటాయింపు
- ఏ మూలకూ సరిపోని నిధులు కేటాయించిన ప్రభుత్వం
- టీచర్ల డబ్బుతోనే తల్లిదండ్రులకు భోజనాలు, డెకరేషన్లు, ఆటల పోటీలు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు



కనీస నిధులు కేటాయించని వైనం..

శ్రీకాకుళం న్యూకాలనీ: మీటింగులు పెట్టండి.. కానీ డబ్బులు అడగకండి.. భోజనాలు పెట్టండి.. ఖర్చులు మాత్రం మాకు చెప్పకండి.. డెకరేషన్లు చేయండి.. ఆ బిల్లుల ఊసు మాత్రం ఎత్తకండి.. ఇదీ ప్రభుత్వ తీరు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం మెగా పేరెంట్స్–టీచర్స్ డే కార్యక్రమం నిర్వహించేందుకు సన్నద్ధమైంది. కానీ ఖర్చును మాత్రం టీచర్లకు అంటగట్టే పథకం వేసింది. షామియానాకే రెండు నుంచి మూడు వేల వరకు ఖర్చయ్యే ప్రస్తుత రోజుల్లో 50 మంది విద్యార్థులున్న ఒక పాఠశాలకు కేవలం రూ.1600 కేటాయించి పండగ చేసుకోవాలని ఆదేశించడాన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. విద్యార్థుల హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులను వారి తల్లిదండ్రులకు అందజేసేందుకు గత వారం రోజులుగా టీచర్లు అగచాట్లు పడ్డారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని అధికారులు ఉత్తర్వుల్లో పేర్కొంటే.. అధికార కూటమి పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు అప్పుడే హడావుడి మొదలుపెట్టేశారు.

విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించేలా..

కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఇప్పటికీ బడుల్లో నెలకొన్న సమస్యలపై దృష్టి పెట్టలేదు. సీబీఎస్సీ సిలబస్‌కు పాతరేసింది, ఇంగ్లిష్ మీడియం చదువులకు స్వస్తి చెప్పింది. టోఫెల్ శిక్షణకు టాటా చెప్పింది. ట్యాబ్‌ల పంపిణీకి ససేమిరా అనేసింది. మధ్యాహ్న భోజనాన్ని నాసిరకంగా అందిస్తోంది. నాడు–నేడుతో బడులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చిరస్థాయిగా పేరు నిలిచిపోతుందని చెప్పి.. రెండో ఫేజ్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులకు నిధులను కేటాయించడం లేదు. ఇక తల్లికి వందనం గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. ఎన్నికల మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్‌లో మీ ఇంట్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఎంతమంది చదివితే అంతమందికి తల్లికి వందనం ఊసే మర్చిపోయింది. ఇన్ని మోసాలు చేసి ఇప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులను ఏమార్చాలనే ఉద్దేశంతో పేరెంట్స్–టీచర్స్ డే పేరిట వేడుకలు నిర్వహించాలని చెప్పింది. కానీ దీనిపై ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాలు, ముఖ్యంగా విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. పేరెంట్స్–టీచర్స్ మీటింగ్‌లో తల్లికి వందనం పథకాన్ని ప్రశ్నించేందుకు తల్లిదండ్రులు సమాయత్తమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రాథమిక పాఠశాలలో నిర్వహించే సమావేశానికి షామియానా, కుర్చీలు, స్నాక్స్, తాగునీరు, భోజనాలు, డెకరేషన్, బహుమతులు ఇలా అన్నింటికి కలిపి కనీసం రూ.3 నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుంది. అలాంటి తరుణంలో 25 మంది ఉన్న విద్యార్థులున్న బడులకు రూ.1200 చొప్పున, 50 మంది ఉన్న బడులకు రూ.1600 చొప్పున, 100 మంది ఉన్న విద్యార్థులకు కేవలం రూ.2400 మాత్రమే కేటాయించి చేతులు దులిపేసుకుంది. కార్యక్రమంలో భోజనాలు, ఆటపాటలు, డెకరేషన్ చేసేందుకు చాలా ఖర్చవుతుందని గతి లేక తామే భరించాల్సి వస్తోందని హెచ్‌ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 2638 బడులకు కేవలం రూ.48.76 లక్షలు మాత్రమే నిధులు కేటాయించి చేతులు దులిపేసుకుంది.

విజయవంతం చేయాలి

పాఠశాలల్లో జరిగే మెగా పేరెంట్స్–టీచర్స్ డే వేడుకలను విజయవంతం చేయాలని డీఈఓ డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య పిలుపునిచ్చారు. ప్రోగ్రాం నిర్వహించిన తీరు, సంబంధిత ఫొటోలు వివిధ యాప్‌లలో అప్‌లోడ్ చేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

● అది పులి కాదు హైనా



గత కొద్ది రోజులుగా ఉద్దానం ప్రాంతానికి కంటి మీద కునుకు లేకుండా చేసిన జంతువును ఉద్దాన వాసులు గుర్తించారు. ఈ ప్రాంతంలో తిరుగుతున్నది పులి కాదని హైనా అని కొందరు గొర్రెల కాపరులు చెప్పారు. దూరం నుంచి చూస్తే పులి లాగానే ఉంటూ పులి పాదాలను పోలిన ఈ జీవిని దుమ్మలగొండి, గొద్దవ, తోడేలు వంటి పేర్లతో పిలుస్తారు. హైనా కదలికలు గమనించి కాశీబుగ్గ ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణకు సమాచారం అందించారు. ఆయనను సంప్రదించగా ఇవి గుంపులుగా తిరుగుతాయని ఎంతటి బలమైన జంతువులపైన అయినా దాడి చేసి తినేస్తాయని, ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

–కాశీబుగ్గ

ఇసుక ర్యాంపు తనిఖీ



ఇసుకర్యాంపును పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్

సరుబుజ్జిలి: ఇసుక ర్యాంపుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. పురుషోత్తపురంలోని వంశధార నదీ తీర ప్రాంతంలో ఇసుక ర్యాంపును శుక్రవారం తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు కూలీలతో మాత్రమే చేపట్టాలని నిర్వాహకులకు ఆదేశించారు. వాహనదారుల నుంచి ఎటువంటి వసూళ్లు చేయవద్దని చెప్పారు. తవ్వకాలు జరిగే ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోజువారీ వచ్చే వాహనాలపై అక్కడున్న లారీ డ్రైవర్లను ప్రశ్నించారు.

దారి కాచి.. దాడి చేసి



- శ్రీకూర్మంలో వ్యక్తి దారుణ హత్య
- పాత కక్షలతో కత్తెలు, కర్రలతో దాడి
- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు
- ప్రాథమికంగా ఎనిమిది మంది నిందితులను గుర్తించిన పోలీసులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద



ఉప్పాడ రాజేష్ (ఫైల్)

గార: దారుణ హత్యతో శ్రీకూర్మం ఉలిక్కి పడింది. రెండేళ్ల కిందట ఇదే ఊరిలో గార వైస్ ఎంపీపీ బరాటం రామశేషు హత్యకు గురయ్యారు. ఇప్పుడు మళ్లీ హత్య జరగడంతో ఊరిలో భయాందోళన నెలకొంది. ఇదే దాడిలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకూర్మంలోని రెడ్డిక వీధికి చెందిన ఉప్పాడ రాజేష్ అలియాస్ ఉల్లిపాయల రాజేష్(38) శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో అదే ప్రాంతానికి చెందిన రాము, అతని భార్య సరోజినితో కలిసి ఇంటి నుంచి బస్టాండ్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నారు. ఆ సమయంలో అదే వీధికి చెందిన మరో వర్గం కర్రలు, కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రాజేష్ అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. రాము తల, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, అతని భార్య సరోజిని కూడా గాయపడింది. వెంటనే స్థానికులు స్పందించి ఇద్దరినీ 108 అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. మృతుడు రాజేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ పైడపునాయుడు, ఎస్ఐ రెల్ల జనార్దనరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భూవివాదాల కారణంగానే హత్య జరిగినట్టు గుర్తించామని డీఎస్పీ తెలిపారు. మూడు ఎకరాల 10 సెంట్ల స్థలం విషయమై 2018 నుంచి ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తోందని చెప్పారు. దాడికి సంబంధించి గురయ్య, భాస్కర్, రమేష్, లోకేష్, గుజ్జు లక్ష్మణ, కొయ్య సాయి, గుజ్జు శ్రీనులను ప్రాథమికంగా నిందితులుగా గుర్తించామని తెలిపారు.

భూ వివాదాలా.. పేకాట గొడవలా..?

శ్రీకూర్మం రెడ్డిక వీధికి చెందిన కొన్ని కుటుంబాల మధ్యన భూవివాదం నడుస్తోంది. ఈ విషయంలో కొందరు వ్యక్తులు జైలు శిక్ష సైతం అనుభవించారని స్థానికులు అంటున్నారు. రాజేష్ పేకాట ఆడటంతో పాటు పేకాట డెన్ నడుపుతుంటాడని, శ్రీకాకుళం నగరానికి చెందిన ఇద్దరు మాజీ రౌడీ షీటర్లతో సత్సంబంధాలు ఉన్నాయని తెలుస్తోంది.

● ఘనంగా హోంగార్డు వ్యవస్థాపక దినోత్సవం



హోంగార్డుల పరేడ్ పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: వ్యక్తిగత క్రమశిక్షణతో హోంగార్డులు ముందుకు సాగాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో శుక్రవారం 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముందుగా కమాండర్ శశిభూషణ్ ఆధ్వర్యంలోని హోం గార్డులు ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. వీరి నుంచి ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ పరేడ్ నిర్వహించిన రెండు, మూడు ప్లటూన్లకు మొదటి, రెండు బహుమతులు అందజేశారు. అనారోగ్యంతో మరణించిన హోంగార్డు అప్పలనాయుడు భార్య భారతికి హోంగార్డుల ఒక్క రోజు వేతనం రూ.4.50 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 751 మంది విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. నైపుణ్యాలు పెంచుకోవాలని, ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. భవిష్యత్‌లో హెల్త్ కార్డులు అందజేస్తామని అన్నారు. అనంతరం 35 ఏళ్ల సర్వీస్ పూర్తిచేసుకున్న వారికి జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, ప్రసాదరావు, సీఐలు ఇమ్మాన్యుయల్ రాజు, అవతారం, ఆర్ఐ నర్సింగరావు పాల్గొన్నారు.

ఆయువు తీరిపోయింది

- ఎస్ఎంపురం గురుకుల విద్యాలయంలో టెన్త్ విద్యార్థి మృతి
- ఆత్మహత్యగా భావిస్తున్న అధికారులు
- మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు



విలపిస్తున్న తండ్రి వాసుదేవరావు



విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, క్లూస్ టీం

ఎచ్చెర్ల క్యాంపస్:

ప్రవేశ పరీక్షలో ప్రతిభ చూపించి గురుకుల పాఠశాలలో సీటు సంపాదించాడు. రెండేళ్లు క్లాస్ టాపర్‌గా ఉన్నాడు. ఇప్పుడు కూడా టాపర్లలో ఒకడిగా రాణిస్తున్నాడు. పేరెంట్స్, టీచర్స్ సమావేశం కోసం డ్యాన్స్ ప్రాక్టీస్ కూడా చేశాడు. కానీ ఏమైందో ఏమో శుక్రవారం తెల్లవారుజామున ఆ విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. స్కూలు బయట వ్యక్తులతో సావాసం ఆ విద్యార్థి ప్రాణాలను బలికొందనే వాదన వినిపిస్తోంది.

ఎస్ఎం పురం గురుకుల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న ముద్దాడ దిలీప్ (15) పాఠశాల భవనం శ్లాబ్ పిట్టగోడకు శుక్రవారం వేకువ జామున వేలాడుతూ కనిపించాడు. పిట్టగోడ రంధ్రానికి టవల్‌తో ఉరిపోసుకుని చనిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా ఓ అభిప్రాయానికి వచ్చారు. అలాగే కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

విద్యాలయంలో పిల్లలు వేకువజామున నిద్ర లేచారు. ట్యాప్ వద్ద కొందరు బ్రష్ చేసుకుంటూ ఉంటే పైన మేడపై నుంచి పిట్టగోడకు వేలాడుతూ దిలీప్ కనిపించాడు. దీంతో వారు ప్రిన్సిపాల్ ఎం. గుణస్వామికి సమాచారం అందించారు. ఆయన వచ్చాక దిలీప్‌ను కిందకు దించి మెడకు ఉన్న టవల్ తొలగించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందడంతో పోలీసులకు, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. జలుమూరు మండలం మాకివలస గ్రామం నుంచి తండ్రి వాసుదేవరావు, తల్లి లక్ష్మి తమ బంధువులతో కలిసి విద్యాలయానికి వచ్చి విద్యార్థి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. హత్య జరిగిందని అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, డీఈఓ తిరుమల చైతన్య, జేఆర్‌పురం సీఐ ఎం.అవతారం పాఠశాలకు వచ్చి వారితో మాట్లాడారు. సమగ్ర విచారణ చేస్తామని హామీ ఇచ్చాక వారు పోస్టుమార్టానికి అంగీకరించారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సంఘటన జరిగిన వెంటనే ఎచ్చెర్ల, లావేరు ఎస్ఐలు సందీప్, లక్ష్మణరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

స్థానికులతో స్నేహమే కారణమా..?

విద్యార్థి దిలీప్ తెలివైన వాడు. చక్కగా చదువుకునేవాడు కూడా. కానీ క్లాస్‌వర్క్ ముగిశాక స్కూలు బయట ప్రాంతం వ్యక్తులతో స్నేహం చేయడం అతడికి శాపమైంది. వారి వల్ల విద్యార్థి చెడు వ్యసనాలకు అలవాటు పడినట్లు కూడా చెబుతున్నారు. కొన్నాళ్ల కిందట స్కూల్‌లోని సరస్వతీ విగ్రహం వద్ద చిల్లర నేరం విషయంలో విద్యార్థిని పది రోజులు సస్పెండ్ చేశారు. విద్యార్థి చనిపోయిన సమయంలో అతడి ప్యాంటు జేబులో సిగరెట్, గుట్కా దొరికినట్టు సమాచారం. మృతికి స్పష్టమైన కారణం తెలియకపోయినా బయట వ్యక్తులతో చెడు స్నేహం, ఒత్తిడి కారణంగా ఈ ఘటన జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ గురుకులం ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఉంటుంది. కొన్నేళ్ల కిందట ఇలాగే ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇప్పుడు మళ్లీ అలాంటి ఘటన జరగడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.



రోదిస్తున్న తల్లి లక్ష్మి

కూటమి వైఫల్యాలను ప్రజలకు చెబుదాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం రూరల్: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చాటి చెబుదామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం పెదపాడులోని ధర్మాన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజల తరఫున పోరాటాలు చేయాల్సిన బాధ్యత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఉందన్నారు. రాష్ట్రంలో 40 శాతం ఓట్లు పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలోనూ రాజ్యసభ సభ్యులు ఉన్నారన్నారు. వీరంతా ప్రజల తరఫున పోరాడుతారని చెప్పారు. తమ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు మూడు అంశాలపై పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని తొలుత కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ఈ నెల 27న సబ్‌స్టేషన్ల వద్ద అధికారులకు వినతి పత్రాలు ఇస్తామన్నారు. జనవరి 3న విద్యార్థుల పక్షాన నిలిచే దిశగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మద్దతుగా కూటమి వైఫల్యాలను చాటిచెప్పే విధంగా ఆందోళన చేస్తామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెక్రటరీగా ఎన్నికైన కేవీవీ సత్యనారాయణ అభినందన సభ ఈ నెల 10న హోటల్ గ్రాండ్‌లో ఉంటుందన్నారు. కార్యక్రమానికి నాయకులంతా హాజరు కావాలని కోరారు.



క్లుప్తంగా

8న ఉత్తరాంధ్ర మాలల గర్జన సభ



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖపట్నం జిల్లా సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో ఈ నెల 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్న ఉత్తరాంధ్ర మాలల గర్జన సభ విజయవంతం చేయాలని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి గౌరవ సలహాదారు కల్లేపల్లి రాంగోపాల్, కన్వీనర్ తైక్వాండో శ్రీను, కో కన్వీనర్ కంత వేణు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూషెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వర్గీకరణపై సుప్రీంకోర్టు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి నిలుపుదల చేయాలని కోరారు. దేశంలోని 40 కోట్ల పైబడిన దళిత, గిరిజనుల రాజ్యాంగబద్ధమైన హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న సభకు జిల్లా నలుమూలల నుంచి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పనులు వేగవంతం చేయాలి



గోశాలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుధాకరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: పల్లెపండగ పనులు గ్రామాల్లో సత్వరం పూర్తిచేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ బి.సుధాకరరావు అన్నారు. ఎచ్చెర్ల మండలం అజ్జరాంలో గోశాల (ఆవుల షెడ్), సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గోశాలల నిర్మాణానికి ముందుకు రావాలన్నారు. పల్లెపండగ పనులకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలన్నారు. ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపొనెంట్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో శోభాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

డీజీపీని కలిసిన ఎస్పీ



డీజీపీ ద్వారకా తిరుమలరావుతో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజ్ కార్యాలయాన్ని శుక్రవారం సందర్శించిన రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని, ఏవోబీ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన నిఘాతో అక్రమ రవాణా అరికట్టాలని, చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాల ద్వారా డేటా సేకరించాలన్నారు. డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఇతర జిల్లాల ఎస్పీలు పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు



తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: సారా బట్టీలపై దాడులు ముమ్మరం చేస్తున్నట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ అన్నారు. శుక్రవారం మర గ్రామంలో దాడులు నిర్వహించి 2300 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. సారాతయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టెక్కలి, నరసన్నపేట ఎస్‌ఐలు సత్యనారాయణమూర్తి, గురుమూర్తి, పలాస ఏఈఎ స్టీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం కూడలిలో జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న బస్ షెల్టర్‌లో శుక్రవారం ఓ వ్యక్తి అపస్మారకంగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిబ్బంది వచ్చి పరిశీలించగా వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. ఇతను రణస్థలం మండలం బొద్దిపాడు గ్రామానికి చెందిన లొడగల రాము (38)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అతిగా తాగటం వల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRA PRADESH INDUSTRIAL INFRASTRUCTURE CORPORATION LTD
(A Government of Andhra Pradesh Undertaking)
Industrial Park, Kusulapuram-532410 ,Email: zmsklm.apiic@ap.gov.in

E – Procurement Tender Notice

Srikakulam District

1. Tender Notice No. 02/ZM/APIIC/SKLM/2024-25, Dated:05.12.2024 (ECV of Rs. 7,83,236.00) for the work of " Providing Avenue Plantation along the road side for upgradation of Industrial Park, Nellimarla, Vizianagaram District under MSE-CDP Program(2nd call)".

Date of Bid download starts from : 05/12/2024 at 8.00PM (for Tender Notice no.02)
Last date of submission of Bid : 20/12/2024 upto 3.00PM (for Tender Notice no.02)
Note : The details of Tender Notice and Bid documents can be downloaded from Website: www.apeprocurement.gov.in

Zonal Manager,
Srikakulam Zone, APIIC Ltd.,
Srikakulam District

ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు ఎసరు!





- సబ్సిడీ ఎత్తివేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర
- జిల్లాలో 51,672 మందికి లబ్ధి చేకూర్చిన గత ప్రభుత్వం
- ఇప్పుడు 200 యూనిట్లు లోపు వాడినా బిల్లు వస్తోందంటున్న లబ్ధిదారులు

అరసవల్లి: ఇప్పటికే విద్యుత్ బిల్లుల చార్జీలను రెండుసార్లు పెంచి వినియోగదారులపై ఆర్థిక భారాన్ని మోపిన కూటమి సర్కారు.. తాజాగా సబ్సిడీలను ఎత్తివేసి ఈ పథకానికి మంగళం పాడే పనిలో పడింది. ఈ క్రమంలో సబ్సిడీ భారాన్ని తగ్గించేందుకు లబ్ధిదారుల సంఖ్యను కుదించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించేవారు. ఆ సబ్సిడీ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించింది. ఈమేరకు 2019లో ప్రత్యేక జీఓ జారీ చేసి.. ఐదేళ్లుగా ఇదే విధానాన్ని అమలు చేశారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్ రాయితీలను పొందుతున్న దళితులపై దృష్టి సారించింది. నెలకు 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగిస్తున్నప్పటికీ..ఆయా లబ్ధిదారులకు బిల్లుల బకాయిలను పంపించి వెంటనే కట్టాలంటూ ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో 30 వేల మందికి పైగా ఎస్సీ, ఎస్టీలు ఉచిత విద్యుత్ సబ్సిడీకి దూరం కావాల్సి వచ్చింది. ఎలాగైనా విద్యుత్ బకాయిలను చెలించాలని, లేదంటే కనెక్షన్లు తొలిగిస్తామంటూ అల్టిమేటం జారీ చేస్తోంది. పలు మండలాల్లో విద్యుత్ కనెక్షన్లను కూడా తొలగించేశారు. దీంతో చేసేదేమీలేక ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు అప్పులు చేసిమరీ విద్యుత్ బిల్లులను చెల్లించి కనెక్షన్లను పునరుద్ధరించుకున్నారు.

లబ్ధిదారుల ఆందోళన..

విద్యుత్ సబ్సిడీలను ఎత్తివేసే కుట్రపై విద్యుత్ అధికారుల తీరు, రాష్ట్ర కూటమి సర్కారు ఆదేశాలపై ఎస్సీ, ఎస్టీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తమ నిరసనలను స్థానికంగా తెలియజేస్తూ..బిల్లుల చెల్లింపులను నిలిపివేయాలని తీర్మానించుకున్నారు. అయితే నిత్యావసరంగా మారిన విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని శాంతియుతంగా పరిష్కరించుకునేలా దళిత నేతలు, బాధిత విద్యుత్ వినియోగదారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే బూర్జ మండలంలో ఎస్సీలంతా తమకు న్యాయం చేయాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. టెక్కలి, నందిగాం,మెళియాపుట్టి, సారవకోట, నరసన్నపేట, కొత్తూరు, పాతపట్నం, రణస్థలం, జి.సిగడాం, ఎచ్చెర్ల, మందస, సోంపేట, కోటబొమ్మాళి తదితర మండలాల్లో ఎస్సీలంతా ఆందోళనకు సమాయత్తమవుతున్నారు.

సబ్సిడీల్లో కోత..

జిల్లాలో శ్రీకాకుళం, టెక్కలి, పలాస డివిజన్ల పరిధిలో మొత్తం 8 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులున్నారు. వీరిలో 35,698 మంది ఎస్సీ, 15,974 మంది ఎస్టీ వినియోగదారులు ఇప్పటివరకు ఉచిత విద్యుత్ సబ్సిడీ పథకం ద్వారా లబ్ధిపొందారు. వీరంతా నెలకు 200 యూనిట్లు లోపే విద్యుత్‌ను వినియోగిస్తూ.. గత ఐదేళ్ల పాటు జీరో బిల్లు



బూర్జలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దళితులు (ఫైల్)

పొందారు. దీంతో నెలకు సబ్సిడీ భారం రూ.1.30 కోట్లను సర్కారే భరించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఏడాది అక్టోబర్ నుంచే సబ్సిడీల్లో కోతను విధించేలా చర్యలకు దిగింది. ఇందులో భాగంగా 200 యూనిట్లు లోపున్న వారిని కూడా బిల్లులు చెల్లించాలని, లేదంటే కనెక్షన్లు కట్ చేస్తామని విద్యుత్ అధికారుల ద్వారా హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో ఇప్పటికే చాలా మండలాల్లో విద్యుత్ కనెక్షన్లు తొలిగించగా.. భయాందోళనలతో ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు తమ బిల్లులను చెల్లించి కనెక్షన్లు తిరిగి పొందారు.

కనెక్షన్లు తొలిగించారు..



ఇంతవరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించి ప్రభుత్వం నుంచి సబ్సిడీ లబ్ధి పొందాం. ఇప్పుడు ఎలాంటి నోటీసులు లేకుండానే మా విద్యుత్ కనెక్షన్లు తొలగించారు. 200 లోపు యూనిట్లు వాడినప్పటికీ నాతో పాటు చాలా మంది ఇళ్లకు చెందిన మీటర్లు కనెక్షన్లు తీసేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే అధికారులు బెదిరింపులకు దిగారు. దీంతో చాలామంది భయపడి బిల్లులు కట్టేసి కనెక్షన్లు పునరుద్ధరించుకున్నాం.

– భోగిరాజు, దళిత సంఘ నేత, బూర్జ

నిబంధనల మేరకే..



జిల్లాలో సుమారు 51 వేల మంది ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీ అమలయ్యింది. ఇటీవల విద్యుత్ వినియోగం పెరగడాన్ని గుర్తించి..200 యూనిట్ల కంటే అధికంగా వినియోగించిన ఎస్సీ, ఎస్టీలకు కచ్చితంగా బిల్లులు చెల్లించాలని ఆదేశాలు వచ్చాయి. నిబంధనల ప్రకారం చర్యలు చేపడుతున్నాం. ఇందులో ఎలాంటి కక్షపూరిత చర్యలుండవు.

– నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

పోలీసులకు చిక్కిన గంజాయి ముఠా



పట్టుబడిన గంజాయి నిందితులతో జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసు అధికారులు

- రూ.6 లక్షల విలువైన 188 కేజీల గంజాయి స్వాధీనం
- సోంపేట రైల్వేస్టేషన్‌లో ఇద్దరు అరెస్టు.. నలుగురు పరారీ

కాశీబుగ్గ: నిఘా తక్కువగా ఉంటుందని చిన్న చిన్న రైల్వే స్టేషన్లను ఎంచుకుని అక్రమ రవాణాకు పాల్పడుతున్న గంజాయి ముఠాను రైల్వే పోలీసులు పట్టుకున్నారు. సోంపేట రైల్వేస్టేషన్ వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం పలాస జీఆర్‌పీ స్టేషన్‌లో సీఐ ఎ.రవికుమార్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు వ్యక్తులు గంజాయి బ్యాగులు పట్టుకుని మారుమూల గ్రామాల గుండా పయనిస్తూ బొలెరో వాహనంతో సోంపేట రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి రైలులో బెంగళూరుకు గంజాయి చేరవేయాలని పథకం రచించారు. ఈ సమాచారం అందుకున్న పలాస ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎం.మలయాద్రి నిఘా పెట్టారు. వారి కదలికలను పసిగడుతూ జీఆర్‌పీ పోలీసుల సాయంతో వాహనాన్ని పట్టుకున్నారు. అందులో ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాకు చెందిన మంటూ దొలాయి, బిలాపో గొమంగో పట్టుబడగా.. మరో నలుగురు పరారయ్యారు. వాహనం తనిఖీ చేయగా ఏడు బ్యాగుల్లో 118 కేజీల గంజాయిని గుర్తించారు. మార్కెట్‌లో దీని విలువ రూ.6లక్షలకు పైగా ధర పలుకుతుందని పోలీసులు తెలిపారు. ఒడిశా నుంచి బెంగళూరుకు గంజాయి రవాణా చేసేందుకు పెద్ద ముఠా పనిచేస్తోందని, గోపాల్ గొమంగో అనే వ్యక్తి ఈ ముఠాను నడుపుతున్నాడని చెప్పారు. కేసు నమోదు చేసి నిందితులను శనివారం విశాఖపట్నం కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్‌ఐ మలయాద్రిని అభినందించారు. సమావేశంలో పలాస ఆర్‌పీఎఫ్ ఓసీ మహపాత్రో, జీఆర్‌పీ ఎస్‌ఐ షరీఫ్, ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ ఎం.మలయాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణతోనే పరిశుభ్రత



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ సౌజన్యభారతి

జి.సిగడాం: తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి కె.సౌజన్యభారతి కోరారు. శుక్రవారం ఎందువ, జి.సిగడాం గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ కె.నిశ్చల, ఎంపీడీఓ జి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో కూలీలే ఇంజినీర్లు!

- అధికార బలం చూపుతున్న అధికార పార్టీ నేతలు
- ఇంజినీర్ పర్యవేక్షణ లేకుండా పనులు
- సీసీ రోడ్ల నాణ్యతకు తిలోదకాలు



ఇంజినీరింగ్ అసిస్టెంట్ లేకుండా ఈదుపురం మంగళ గోర్జిలో సీసీ రోడ్డు వేస్తున్న కూలీలు

ఇచ్ఛాపురం రూరల్: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన ఐదు నెలల్లోనే తమ్ముళ్లు రాజకీయ బలం చూపుతున్నారు. పల్లెపండగలో భాగంగా ఇచ్ఛాపురం మండలంలోని 21 పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.625 లక్షలతో 153 సీసీ రోడ్లు వేసేందుకు నిధులు విడుదల చేసింది. ఇందులో భాగంగా కూటమి నేతలే వెండర్స్‌గా వ్యవహరిస్తూ ప్రతి పంచాయతీకి రూ.30 లక్షలు చొప్పున కేటాయించింది. దీంతో కూటమి నేతలకు పంట పండింది. గత ప్రభుత్వం వేసిన సీసీ రోడ్లు పైనే మరోమారు సీసీ రోడ్లు వేసేందుకు సిద్ధమయ్యారు. స్థానిక మండల ఇంజనీర్ ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం సహాయక ఇంజినీర్ పర్యవేక్షణలో కొలతలు, నాణ్యత ప్రకారం సీసీ రోడ్లు వేయాలి. ఈ నిబంధనలను తుంగలో తొక్కిన కూటమి నేతలు ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఒత్తిడి తెస్తూ ఇష్టారాజ్యంగా సీసీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు జరుగుతున్న సమయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు 'పనులు చూశామా..వెళ్లామా...బిల్లులకు ఆమోదం తెలిపామా...' అన్న మాదిరిగానే వ్యవహరించాలే తప్పా రూల్స్ పాటించాలని తమకు చెప్పరాదంటూ అక్కడక్కడ వెండర్స్ హుకుం జారీ చేస్తున్నారు. దీంతో పూర్తి స్థాయిలో పనులను పర్యవేక్షించలేక పోతున్నామని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నతాధికారుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. గతంలో మండలంలో 16 గ్రామ సచివాలయాల్లో 16 మంది ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆరు మంది బదిలీపై వెళ్లిపోగా, మిగిలిన 10 మందిలో కీర్తిపురం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆశి విశ్వనాథం హౌసింగ్ ఏఈగా బాధ్యతలు ఇవ్వడంతో ఖాళీ ఏర్పడింది. బూర్జపాడు, కేశుపురం, తులసిగాం, ఈదుపురం-1, ఈదుపురం-2, బిర్లంగి, కీర్తిపురం గ్రామ సచివాలయాల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ఫలితంగా సంబంధిత గ్రామ సచివాలయ పరిధుల్లో జరుగుతున్న సీసీ రోడ్ల పర్యవేక్షణ పూర్తిగా గాడితప్పింది. నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ వెండర్స్‌గా వ్యవహరిస్తున్న కూటమి నేతలు కూలీలనే ఇంజనీర్లుగా చేస్తూ రోడ్లు వేస్తున్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీరాజ్ జేఈ భగీరథ దొళాయి గత నెల రిటైర్మెంట్ కావడంతో కూటమి నేతలే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు.



దొంకూరు బస్టాండ్ సమీపంలో సీసీ రోడ్డు వేస్తున్న కూలీలు

అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం నానుబాలవీధిలో విజయదుర్గా దేవిని మార్గశిర మాస శుక్రవారం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

- శ్రీకాకుళం కల్చరల్



రామశేషు ఆశయాలు కొనసాగిద్దాం



రామశేషు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు

గార : శ్రీకూర్మం మాజీ సర్పంచ్ బరాటం రామశేషు ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. శ్రీకూర్మంలో శుక్రవారం బరాటం రామశేషు రెండో వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ రామశేషు మరణం తీరని లోటన్నారు. కళింగ వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ మంచి నాయకుడిగా రామశేషు గుర్తింపు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ముందుగా భార్య బరాటం జయలక్ష్మీ, తండ్రి బరాటం నాగేశ్వరరావులు రామశేషు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురాం, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గోరు అనిత, అంధవరపు బాలకృష్ణమూర్తి, గొండు జయరాం, కొయ్యాన నాగభూషణం, గొలివి వెంకటరమణమూర్తి, పెదలాపు శ్రీరాములు, ఊట అప్పలనాయుడు, పల్ల రాధ, వైశ్య ప్రతినిధులు గుడ్ల దాము, అంధవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, రామశేషు వర్ధంతి సందర్భంగా పాతశ్రీకాకుళంలోని వృద్ధాశ్రమం, కలెక్టరేట్ సమీపంలోని ఆశ్రమం, సత్యసాయి మధ్యాహ్న భోజన పథకం, శ్రీకూర్మంలోని నవజీవన ఆశ్రమానికి భోజనాలు అందించారు.

ముగిసిన పాలిటెక్నిక్ ఫెస్ట్



ప్రథమ బహుమతి అందుకుంటున్న శివానీ కళాశాల విద్యార్థులు



ద్వితీయ బహుమతి అందుకుంటున్న శ్రీవేంకటేశ్వర కాలేజీ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన రెండు రోజుల పాలిటెక్నిక్ ఫెస్ట్- 2024 శుక్రవారంతో ముగిసింది. జిల్లాలోని పది ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుంచి 69 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. చిలపాలెంలోని శివానీ కళాశాల విద్యార్థులు రూపొందించిన రైల్వే సెన్సార్ గేట్ ప్రాజెక్టు ప్రథమ స్థానం సాధించడంతో రూ.25వేలు గెలుచుకున్నారు. ఎచ్చెర్లలోని శ్రీ వేంకటేశ్వర పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల రూపొందించిన 'సామీప్య శ్రేణిలో స్పెక్ట్రా గుర్తింపు' ప్రాజెక్టు ద్వితీయ స్థానం సాధించడంతో రూ.10 వేలు గెల్చుకున్నారు. వీటితో పాటు మరో 15 ఉత్తమ ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయి ఫెస్ట్‌కు ఎంపిక చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకి రామయ్య, మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవింద నాయుడు, ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు, సీనియర్ విభాగాధిపతులు జి.దామోదర్‌రావు, డి.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

3.30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యం



నిమ్మాడ ఎఫ్‌సీఐ గొడౌన్ వద్ద సీఎంఆర్ డెలివరీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

టెక్కలి: జిల్లాలో ఈ ఏడాది సీఎంఆర్ విధానం ద్వారా 3 లక్షల 30 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించేందుకు లక్ష్యంగా నిర్దేశించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వెల్లడించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడ, రావిపాడు ఎఫ్‌సీఐ గొడౌన్‌లలో సీఎంఆర్ డెలివరీ పాయింట్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సుమారు 24 ఎఫ్‌సీఐ గోదాములు ఉన్నాయని, వాటి పరిధిలో గల రైస్ మిల్లుల నుంచి బియ్యం సేకరిస్తామని పేర్కొన్నారు. మొదటగా నిమ్మాడ నుంచి బియ్యం సేకరణ ప్రారంభిస్తామని జేసీ తెలిపారు. మిల్లర్లంతా పూర్తి స్థాయిలో సహకరించి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ టి.వేణుగోపాల్, సహాయ మేనేజర్ శ్రీనివాసరావు, డీఎస్ఓ జి.సూర్యప్రకాశ్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె.హరివరప్రసాద్, నాయకులు బోయిన రమేష్, వి.విజయలక్ష్మి, టి.రామకృష్ణ, కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వ్యవసాయ కార్యకర్తల శిక్షణ



శిక్షణ పొందుతున్న కార్యకర్తలు

ఎచ్చెర్ల క్యాంపస్ : ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో ఏపీ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నాలుగు విడతలుగా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యకర్తల శిక్షణ శుక్రవారంతో ముగిసింది. 350 మంది కార్యకర్తలు శిక్షణ పొందారు. చివరి రోజు కార్యక్రమంలో తమిళనాడుకు చెందిన రైతు సాధికార సంస్థ రాష్ట్ర రిసోర్సుపర్సన్ పి.దేవుళ్లు మాట్లాడుతూ తృణధాన్యాలు వంటి లాభసాటి పంటలు సాగు చేయాలన్నారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు, బీజామృతం వంటి సేంద్రియ ఉత్పత్తులతో సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి



మృతిచెందిన రవణమ్మ

టెక్కలి రూరల్: మండలంలోని గూడెం పంచాయతీ పిట్టలసరియా గ్రామంలో శుక్రవారం పాముకాటుకు గురై దాసరి రవణమ్మ(50)అనే మహిళ మృతి చెందింది. పొలంలో పనులు చేస్తుండగా విషసర్పం కాటు వేయడంతో స్థానికులు టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. అనంతరం మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం తరలించారు. రవణమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారు.

చేతిలో బాంబు పేలి యువకుడికి గాయాలు



గాయపడిన సాయి

టెక్కలి రూరల్: టెక్కలి ఆది ఆంధ్ర వీధికి చెందిన దేవాది సాయి అనే యువకుడు బాంబు పేలుడులో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. పంట పొలాల్లో చొరబడుతున్న అడవి పందులను చంపేందుకు సాయి గురువారం రాత్రి తన పాత ఇంటి వద్ద నాటు బాంబులు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. చేతివేళ్లు తెగిపడి తీవ్రంగా గాయపడటంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖపట్నంకి తరలించనున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి టెక్కలి సీఐ విజయ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. పుష్ప-2 సినిమా థియేటర్ వద్ద బాంబులు కాలుస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని ఫిర్యాదు అందిందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253939]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14790]

■ కష్టమైనిష్టే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8317512135 [HA-99202]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ /నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. Ph: 9640400073, 9160900024 [HA-1388]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.